AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
01-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

సొసైటీల ఎన్నికలు నిర్వహించాలి

ఐఐటీ అడ్వాన్స్ ఫలితాల్లో కాకతీయ విద్యార్థుల ప్రభంజనం..

ఇందిరమ్మ ఇళ్ల పేరిట కాంగ్రెస్ డ్రామాలు : స్రవంతి రెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలో సోమవారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ఆడుతున్న కొత్త డ్రామా అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి విమర్శించారు. ఇళ్లు నిర్మించడంలో విఫలమైన నాయకులు ప్రారంభోత్సవాల పేరుతో ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ గెలిచినంత బిల్డప్ ఇస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. మూడేళ్లలో నిజామాబాద్‌లో 10,500 ఇండ్లు కట్టాల్సిన చోట, కనీసం 300 ఇండ్లు కూడా పూర్తి చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లాకు నయాపైసా నిధులు తీసుకురాలేదని విమర్శించారు.

టార్గెట్ షబ్బీర్ అలీనేనా?..

గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తమ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీని ఉద్దేశించి చేశారంటూ షబ్బీర్ అలీ అనుచర వర్గం రగిలిపోయింది. 'పార్టీలో ఉంటూ పార్టీ పరువు తీస్తున్నారు. సీనియర్ నేతపై ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం సరికాదు. ఇది పూర్తిగా క్రమశిక్షణా రాహిత్యం' అంటూ ఆ వర్గం నేతలు భగ్గుమన్నారు. ఇన్నాళ్లూ సర్దుకుపోయినా, ఇక సహించేది లేదని తేల్చిచెప్పారు. చంద్రశేఖర్ రెడ్డి తీరు కొత్తేం కాదని, ఇదే ఆయన విధానమని, గతంలోనూ పలుమార్లు సొంత పార్టీ నేతలపైనే విమర్శలు గుప్పించి హైకమాండ్‌కు తలనొప్పిగా మారారని వారు గుర్తుచేస్తున్నారు.

క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు

చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలో ఒక వర్గంలో చిచ్చు రాజేయగా విషయం సీరియస్‌గా మారుతోంది. ఇక ఉపేక్షించేది లేదంటూ షబ్బీర్ వర్గం ఏకంగా కార్యాచరణకు దిగింది. గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నేరుగా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. 'ఇలాంటి వారిని ఉపేక్షిస్తే క్యాడర్‌లో తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పార్టీ కట్టుబాటును దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవాలి'' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో రచ్చకెక్కిన విబేధాలు

- షబ్బీర్ అలీపై చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యలతో దుమారం
- టీపీసీసీ జనరల్ సెక్రెటరీపై అధిష్టానానికి ఫిర్యాదులు
- సస్పెండ్ చేయాలని డిమాండ్

కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ చేసిన మూడు నక్కల వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. పరోక్షంగా తమ నేత షబ్బీర్ అలీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారంటూ ఆయన అనుచర వర్గం రగిలిపోయింది. ఏకంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నేరుగా క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయడం కామారెడ్డి కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. – అక్షరటుడే, కామారెడ్డి

కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు రచ్చకెక్కాయి. టిపిసిసి జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి గత నెల 25న తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధిని అడ్డుకుంటున్నది మూడు నక్కలు అంటూ ముగ్గురు నేతలపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. పేర్లు నేరుగా ప్రస్తావించకపోయినా, ఆ మాటల తూటాలు ఎవరిని ఉద్దేశించి పేల్చారో అందరికీ అర్థమైపోయింది. దాంతో అసలు రచ్చ మొదలైంది. మిగతా వారు ఆ వ్యాఖ్యలను లైట్‌గా తీసుకున్నా సొంత పార్టీ నేతలు మాత్రం జీర్ణించుకోలేకపోయారు. అంతే.. మా నాయకుడిని అంత మాట అంటారా అంటూ ఒంటికాలిపై లేచి నిలబడ్డారు.

పైకి మాత్రమే ఐక్యంగా ..

కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు ఉన్నాయని ఎప్పటినుంచో ప్రచారం సాగుతోంది. వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టడం, నియోజకవర్గంలో రెండు పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం, ఎవరికి వారే పార్టీ చేరికలు, ఇతర కార్యక్రమాలు చేపట్టడం వర్గపోరుకు నిదర్శనం. పలు సందర్భాల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా అదంతా ఏమి లేదు. నాయకుల మధ్య మనస్పర్థలు మాత్రమే. మేమంతా ఒక్కటే గ్రూపులేమి లేవు. వర్గపోరు లేదు అంటూ పైకి నాయకులు చెప్పుకుంటూ వచ్చారు.

సీనియర్లను లెక్క చేయకుండా..

పార్టీలో చంద్రశేఖర్ రెడ్డి వ్యవహార శైలి నేతలకు కొరకరాని కొయ్యలా మారిందన్న టాక్ వినిపిస్తోంది. సీనియర్లను సైతం లెక్కచేయకపోవడం ఆయనకు అలవాటుగా మారింద ని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలోనూ పలుమార్లు బహిరంగ విమర్శలు చేసి చర్చకు తెరలేపారన్న టాక్ ఉంది. ఈసారి ఏకంగా మాజీ షబ్బీర్ అలీని నేరుగా టార్గెట్ చేసి నక్క అనే పదం వాడటంతో వ్యవహారం చేయి దాటిందన్న చర్చ సాగుతోంది. మూడు నక్కలు వ్యాఖ్యలతో ప్రస్తుతం హాట్ హాట్‌గా కామారెడ్డి రాజకీయాలు నడుస్తున్నాయి. ఆయనపై చర్యలు తీసుకుంటారని చర్చ సాగుతోంది. ఫిర్యాదుపై డిసిప్లినరీ కమిటీ ఏం నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

తెలంగాణ అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం

అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు కామారెడ్డి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం నిర్వహించే జెండావిష్కరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వీ.హన్మంత్ రావు ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రమే కామారెడ్డికి చేరుకున్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ఎన్.వై.గిరి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం 8 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 8.15 గంటలకు జిల్లా పురోగతిపై హన్మంత్ రావు ప్రసంగిస్తారు. అనంతరం 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.30 గంటలకు రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, 9.40 గంటలకు స్టాల్స్ సందర్శన, 9.50 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని అధికారులు తెలిపారు. మంగళవారం నిర్వహించే వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

డివిజన్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

అక్షరటుడే, కామారెడ్డి: ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు వ్యయ ప్రయాసలకు గురై జిల్లా కేంద్రానికి రావొద్దని.. స్థానిక డివిజన్ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ ఎన్.వి.గిరి, జడ్పీ సీఈవో చందర్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, ప్రాధాన్యతతో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ల లోనూ ప్రజావాణి నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. అయా డివిజన్ల పరిధిలోని ప్రజలు తమ అర్జీలను అక్కడి కార్యాలయాల్లోనే సమర్పించి పరిష్కారం పొందాలన్నారు. చిన్న సమస్యల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని, స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలనలని కలెక్టర్ సూచించారు. అధికారులు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

శ్మశాన వాటిక అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ప్రచారం అవాస్తవం

అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలోని 8వ వార్డులో శ్వశాన వాటిక అభివృద్ధిని మున్సిపాలిటీ అడ్డుకుంటోందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేసారు. జూన్ 5న జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశానికే తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నిబంధనల ప్రకారం అనుమతులు రాగానే తదుపరి చర్యలు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీలో ఉందని వెల్లడించారు. అన్ని అనుమతులు పూర్తి కాగానే నిర్మాణానికి ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు పూర్తి నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ ధ్యేయమని, ప్రజల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. త్వరలోనే ఈ స్మశాన వాటికను అన్ని హంగులతో ఆదర్శవంతమైన సదుపాయంగా తీర్చిదిద్దుతామని ఆమె హామీ ఇచ్చారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను ముస్తాబు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీ.ఆర్.వో గీత ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయకనగర్ లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ముఖ్య అతిథితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలలో లోటుపాట్లకు తావులేకుండా, పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

ప్రజావాణికి 148 ఫిర్యాదులు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో 148 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్‌వో గీత, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సాయన్న, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఆలూర్ డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రవీణ్ కుమార్

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల నూతన డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ధర్పల్లి మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఆలూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆలూర్ తహశీల్దార్ రమేష్, ఆర్ఐ అరవింద్ ఆధ్వర్యంలో ప్రవీణ్ కుమార్‌కు స్వాగతం పలికి సన్మానించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని, రెవెన్యూ సేవలను పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు శ్రీజ, శ్రీవాణి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాబాయి ఇంట్లో చోరీ చేయించిన వ్యక్తి.. ముగ్గురి అరెస్ట్

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : ఆర్మూర్ దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. వారి నుంచి రూ.31.48 లక్షల విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆర్మూర్ పట్టణంలో మే 24న చోరీ జరిగింది. ఈ కేసులో రూ.41,31,500 విలువైన బంగారం, వెండి, నగదు చోరీ అయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం 9 గంటలకు, ఆర్మూర్ నగరంలోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా చోరీ చేసిన వ్యక్తులుగా తేలింది. ఆర్మూర్ నగరానికి చెందిన విజయ్ అగర్వాల్ అనే వ్యక్తి తన బాబాయ్ ఇంట్లో దొంగతనం చేయడానికి ఒక పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకోసం మరో ముగ్గురితో బేరం కుదుర్చుకున్నాడు. ఆర్మూర్ నగరంలోని మహాలక్ష్మి కాలనీలో గల తన బాబాయ్ కుటుంబ సభ్యులు అందరూ వేములవాడ వెళ్లగా వారి ఇంట్లో సల్మాన్ ద్వారా విలువైన బంగారం వెండి నగదును దొంగతనం చేయించాడు. నిందుతులు విజయ్ అగర్వాల్, హైదరాబాద్ నగరంలోని బంజరాహిల్స్‌కు చెందిన సల్మాన్ ఖాన్, బంజరాహిల్స్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మంజల్ సాయి కుమార్‌లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరో నిందితుడు శ్రీహరి పరారీలో ఉన్నారని

వెల్లడించారు. నిందితుల నుంచి పోలీసులు 590 గ్రాముల బంగారం, రెండు వెండి లక్ష్మి బిళ్లలు 300 గ్రాములు, వెండి ప్లేట్, రూ.19,33,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన సొత్తును తీసుకోవడానికి నిందితులు ఆర్మూర్‌లోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్దకు రాగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీపీ తెలిపారు. విజయ్ అగర్వాల్ గతంలో పలు కేసులలో నిందితుడిగా ఉండటంతో అతనిపై ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ తెరిచారు. కేసును ఛేదించడంలో ఏసీపీ ఆర్మూర్ జె. వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, సాయినాథ్, అమరేందర్, కిరణ్ కుమార్, సతీష్, అశోక్, అన్వేష్‌లను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

అక్షరటుడే, బోధన్ : బోధన్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కార్మికులను సన్మానించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, కౌన్సిలర్లు ఆదినారాయణ అంగం రవి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాము, మాజీ పట్టణ అధ్యక్షుడు పాషా కార్మికుల సేవలను కొనియాడారు. మున్సిపల్ సిబ్బంది బక్రీద్ రోజున ఉదయం నుంచి కుర్బనిలు చేసిన చోట వ్యర్థాలను వేణు వెంటనే తొలగించడం వారి పని నైపుణ్యానికి నిదర్శనం అన్నారు. పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసుకుంటే పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్లలోకి మురుగునీరు వస్తోందని ఫిర్యాదు

ఎల్లారెడ్డి పట్టణంలోని 10వ వార్డులో డ్రైనేజీ నీరు ఇళ్లలోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. గత 8 రోజులుగా ఈ సమస్య కొనసాగుతుండడంతో చుట్టుపక్కల ప్రజలు ఈగలు, దోమల బెదదతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ మేరకు వార్డు ప్రజలు సోమవారం ఆర్డీవో ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ సిబ్బందికి చెప్పినా సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. - అక్షరటుడే, ఎల్లారెడ్డి

డ్రంకన్ డ్రైవ్..13 మందికి జైలుశిక్ష

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కామారెడ్డి పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 87 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా.. కోర్టు మొత్తం రూ.99 వేలు జరిమానా విధించింది. వీరిలో 13 మందికి జైలు శిక్ష విధించింది. అందులో ఇద్దరికి ఒక రోజు, 10 మందికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సొసైటీల ఎన్నికలు నిర్వహించాలి

- పాలకమండళ్ల నియామకం సరికాదు
- ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ ఎన్నికలను రద్దు చేసిన విషయం తెలిసిందే. నామినేటేడ్ విధానంలో పాలకమండళ్లను నియమిస్తామని పేర్కొంది. అయితే ఈ విధానాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. రైతు సంక్షేమే లక్ష్యంగా ఉంటే ఎన్నికలు తప్ప వేరే మార్గం లేదని.. నామినేటెడ్ పద్ధతి చట్టవిరుద్ధం అని రైతు సంఘం ప్రతినిధులు, ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రైతు శ్రేయస్సు దృష్ట్యా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని రైతు సంఘాలు, ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనచారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్లు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా సహకార సంఘాల పాలకవర్గాలను నామినేటెడ్ విధానంలో నియమించాలని చూస్తోందన్నారు. తమ అనుచరులకు పదవులు అందిస్తూ రాజకీయ ఉపాధి కల్పించేందుకు కుట్ర పండుతుందని, దీంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయని రైతు సంఘం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

2025 వరకే పదవీకాలం

సొసైటీ ఎన్నికలు 2020లో జరిగాయి. గెలిచిన పాలకమండళ్ల పదవీకాలం 2025 వరకే ఉంది. అయితే అప్పటి నుంచి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. పాలకమండళ్లను నామినేటెడ్ విధానంలో భర్తీ చేస్తామని ఇటీవల ప్రకటించింది. ఎన్నికలు లేకుండా నామినేషన్లతో సొసైటీలను నడపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రైతు నాయకులు వాదిస్తున్నారు. తెలంగాణ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ 1995 ప్రకారం ప్రతి 5 ఏళ్లకు ఒకసారి ఎన్నికలు తప్పనిసరి. నామినేషన్ అనేది అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలిక ఏర్పాటు మాత్రమే.

ఆశావహుల ప్రయత్నాలు

నామినేట్ విధానంలో సొసైటీ పాలక మండళ్లను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. నాయకులను మచ్చిక చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికలు లేకుండా ఐదేళ్లపాటు పదవులు అనుభవించవనే ఆశతో ఆశావాహులు పాలకుల వద్ద పడికాపులు కాస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో నామినేట్ పదవుల ను ఎవరికి ఇవ్వాలనే అంశాలపై సమావేశాలు సైతం నిర్వహించారు.

ఆంక్షలు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి : రైతులు పండించిన జొన్నలను ఆంక్షలు లేకుండా కొనుగులు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. బయోమెట్రిక్ విధానం తీసుకురావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. జొన్నల కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పిట్లంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. కొనుగోలు అనంతరం ఓటీపీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు బయోమెట్రిక్ కావాలంటే.. కౌలు రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు చేసిన జొన్నలను తరలించడానికి లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు విఠల్ రెడ్డి, కార్యదర్శి శంకర్ రావు, ఆనంద్ రావు, రాజా గౌడ్ పాల్గొన్నారు.

'అగ్నివీర్'కు సెలెక్ట్ అయిన యువకులకు సన్మానం

అక్షరటుడే, నిజామాబాద్ రూరల్ : మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన స్నేహిత్, అరుణ్ గౌడ్ అగ్నివీరులుగా ఎంపికయ్యారు. దీంతో వారిని నిజామాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ సేవకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

రైతు కుటుంబానికి రెండు లక్షల చెక్కు అందజేత

అక్షరటుడే, గాంధారి: గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బ్రాహ్మణపల్లికి చెందిన రైతు బొమ్మటి శేఖర్ కుటుంబానికి రూ. రెండు లక్షల చెక్కు అందజేశారు. సదరు రైతు క్రాప్ లోన్ తీసుకోగా.. ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో మరణించాడు. సొసైటీ జనతా ప్రీమియం ఇన్సూరెన్స్ కలిగి ఉండడంతో అతని కుటుంబానికి చెక్కును అందజేశారు. వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సాయికుమార్, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీపాల్, సొసైటీ సీఈవో సాయిలు, సొసైటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో రోడ్డు ప్రమాదం.. రెండు కార్లు ధ్వంసం..

అక్షరటుడే, ఇందూరు: నిజామాబాద్ నగరంలో రోడ్డు ప్రమాదం జరిగింది. గంగాస్థాన్ ప్రాంతంలో రెండు కార్లు ఢీకొన్నాయి. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తుండగా.. గంగాస్థాన్ వద్ద ఓ కారు మరో కారును ఢీకొట్టింది. దీంతో సతీశ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అఖిల్ అనే వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కాకతీయ విద్యార్థుల ప్రభంజనం..

అక్షరటుడే, ఇందూరు: ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో నిజామాబాద్ కాకతీయ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. హెచ్. భరత్ 1,275 ర్యాంకు, జె. తన్విత 1,573 ర్యాంకు, బి.సంధ్య 1,627 ర్యాంకు, ఆర్.బన్నీ 1,834 ర్యాంకు, ఎ.అత్రిజ్ 2,361 ర్యాంకు సాధించారు.

జాతీయ స్థాయిలో సత్తా

ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రకటించిన ఐఐటీ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటారని తెలిపారు.

ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో బోధన

ఇంటర్మీడియట్‌లో అత్రుత పడితే జాతీయస్థాయి ఐఐటీ మెడికల్ పరీక్షలలో రాణించలేరని రామోజీరావు అన్నారు. స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ ఉదయం రెగ్యులర్ సిలబస్‌తో పాటు మధ్యాహ్నం ప్రతిరోజూ ప్రతి సబ్జెక్టును కాలేజీ ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో ఉన్నతమైన ర్యాంకులు సాధించగలుగుతారని వివరించారు. అందుకే విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ స్థాయిలోనే తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలన్నారు.

విద్యార్థులకు అభినందన

వివిధ కేటగిరిలలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన కాకతీయ విద్యార్థులను డైరెక్టర్ సీహెచ్ తేజశ్విని అభినందించారు. అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. విశేషమైన కృషిచేసిన ఉపాధ్యాయ బృందానికి, ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు, సిబ్బందికి ఛైర్ పర్సన్ శ్రీమతి, సీహెచ్.విజయలక్ష్మి, డైరెక్టర్ సీహెచ్ రాజా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ కళాశాలల ప్రిన్సిపాళ్లు సందీప్ కులకర్ణి, వి.రణధీశ్ శర్మ, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ శ్యాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: జిల్లాలో చీతా ఫోర్స్ దూకుడు ప్రదర్శిస్తోంది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేలా మెరుపు దాడులు చేస్తోంది. తాజాగా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ శివారులో గల కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు చీతా ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు బృందం అక్కడ అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న కార్యకలాపాలను గుర్తించింది. తనిఖీల సందర్భంగా మొరం తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక జేసీబీ, మొరాన్ని రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చట్టపరమైన చర్యల నిమిత్తం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ మొరం, ఇసుక, మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

అక్షరటుడే, ఎల్లారెడ్డి : ఎమ్మెల్యే మదన్‌మోహన్ సహకారంతో ఎల్లారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మత్తమాల భాగ్యవతి తెలిపారు. పట్టణంలోని ఏడో వార్డులో ఛైర్మన్ పద్మ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మదన్మోహన్ పట్టణ కేంద్రంలోని సమస్యలను తెలియజేయగానే వెంటనే స్పందించి నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. రూ.1.74 కోట్ల నిధులతో ఏడో వార్డులో సీసీ రోడ్డును పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్లు గాదె తిరుపతి, సయ్యద్ గఫర్, రఫిక్, తమ్మల గాయత్రి, శ్యామ్, కో ఆప్షన్ మెంబర్లు పప్పు వెంకటేశం, అరుణ, కాంగ్రెస్ నాయకులు ప్యాలాల రాములు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ చేశారని గంగపుత్రుల ఆవేదన.. కలెక్టర్‌కు ఫిర్యాదు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తమను సాంఘిక బహిష్కరణ చేశారని వేల్పూరు గంగపుత్ర సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామాభివృద్ధి కమిటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వేల్పూర్ గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. వారు మాట్లాడుతూ.. తాము గ్రామంలోని చెరువుల్లో చేపలు పడుతూ జీవిస్తున్నామని చెప్పారు. కొంతకాలంగా గ్రామంలోని వీడీసీ సభ్యులు తమపై అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తాము చేపలు పట్టుకోవడానికి వీడీసీ వారు రూ.50 వేల జరిమానా వేశారని సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆ డబ్బులు కట్టకపోవడంతో తమ సంఘంలోని సభ్యులందరిని సాంఘిక బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీడీసీపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.